క్లుప్తంగా

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు


చంద్రేడులో కొలువైన వేంకటేశ్వరస్వామి

రంగంపేట: మాఘ మాసం మొదటి శనివారం సందర్భంగా మండలంలోని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల పరిధిలోని చంద్రేడులో కొలువైన పద్మావతీ, అలమేలుమంగ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు కంటి వైద్యశిబిరం

బిక్కవోలు: స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సభ్యుడు జంగా విహారి శనివారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. స్థానికులే కాక చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హాజరయ్యేవారు ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు పాత మెడికల్ రిపోర్టులు వెంట తీసుకు రావాలని సూచించారు.

పోషకాహారంతో ఆరోగ్యకర సమాజం


పుట్టకొండలో ఆకుకూరలు పంపిణీ చేస్తున్న సీడీపీఓ జ్యోతి

పెదపూడి: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ జ్యోతి అన్నారు. పుట్టకొండ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం పోషణ వాటికలో భాగంగా ఆకు కూరలను తల్లులు, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పొందే పోషణ పదార్థాలను తీసుకుని ఆరోగ్యవంతంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీపద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్త దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

చదువుపై మరింత శ్రద్ధ చూపాలి


రఘుదేవపురం హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ జ్యోత్స్న

సీతానగరం: పదో తరగతి పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో విద్యార్థులు చదువుపై మరింత శ్రద్ధ చూపాలని, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అన్నారు. రఘుదేవపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. రాత్రి సమయంలో చక్కగా పడుకుని, వేకువజామునే నిద్ర లేచి చదువుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్యామల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


పందలపాకలో వంతెన వద్ద అడ్డగా నిలిచిన భారీ వాహనం

బిక్కవోలు: మండలంలోని పందలపాక వంతెన వద్ద త్రుటిలో ప్రమాదం తప్పింది. రాయవరం నుంచి ధాన్యం లోడుతో వస్తున్న లారీ వంతెన వద్ద మలుపు తిరుగుతున్న సమయంలో కాలువ వైపునకు వెళ్లిపోయింది. రహదారికి అడ్డంగా వాహనం నిలిచిపోవడంతో వెనుక వాహనాలు సైతం నిలిచి పోయాయి. ట్రాఫిక్‌కు చాలాసేపు అంతరాయం కలిగింది. చివరకు ఎలాగోలా వాహనం వెనక్కి రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

93 శాతం పింఛన్ల పంపిణీ

పెదపూడి: మండలంలో సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ 93 శాతం పూర్తయిందని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి తెలిపారు. దోమాడ, కరకుదురు, పెదపూడి గ్రామాల్లో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సచివాలయ కార్యదర్శులు ఉష, కృష్ణారెడ్డి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

బాటలపై బూటకం

- సంక్రాంతి వచ్చి, వెళ్లిపోయింది
- మరమ్మతులకు నోచుకోని రహదారులు
- గాల్లో కలిసిన సీఎం చంద్రబాబు హామీలు
- రాకపోకలకు ప్రజల అవస్థలు


రాపాకలో అధ్వానంగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు

సీతానగరం: '' నగరాల్లో స్థిరపడిన వారు, ఎన్నారైలు సంక్రాంతి పండక్కి సొంత ఊళ్లకు వచ్చే నాటికి రోడ్లన్నీ కళకళలాడాలి. మన ఊరి రోడ్లు బాగుపడ్డాయని అందరూ సంతోషించాలి'' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సందేశం ఇచ్చారు. సంక్రాంతి వచ్చింది, అందరూ సొంత ఊళ్లకు వచ్చారు, పండగ అనంతరం తిరిగి వెళ్లిపోయారు. కానీ రోడ్లు మాత్రం కనీస మరమ్మతులకు నోచుకోలేదు. ఫలితంగా రోడ్లపై ప్రయాణం వాహనచోదకులకు నిత్యం నరకాన్ని చూపిస్తోంది. సీతానగరం మండలంలోని పలు రోడ్లు అధ్వానంగా మారడంతో రాకపోకలు ప్రజలు అవస్థలు పడుతున్నాయి.

ఏటిగట్టు రోడ్డు

సీతానగరం – పురుషోత్తపట్నంలో పంచాయత్ రాజ్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఏటిగట్టు రోడ్డు అతి ప్రధానమైంది. ఈ రోడ్డు మీదుగానే పాపికొండల పర్యాటకులు తరలివెళుతుంటారు. నిత్యం ప్రైవేటు బస్సులు, కార్లు, ఆటోలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన సామగ్రిని కూడా భారీ వాహనాలపై తరలిస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో పది కిలోమీటర్ల మేర ఏటిగట్టు రోడ్డు పూర్తిగా దెబ్బతింది.

బూడిదతో అవస్థలు

గత సీజన్‌లో కురిసిన వర్షాలకు రోడ్డు మరింత దారుణంగా తయారైంది. దానికి తోడు పోలవరం ప్రాజెక్టును కాంట్రాక్ట్ తీసుకున్న మెగా కంపెనీ ఈ పది కిలోమీటర్ల రోడ్డుపై పడిన గోతుల్లో క్వారీ


సీతానగరం - పురుషోత్తపట్నం రోడ్డుపై వేసిన క్వారీ బూడిద

బూడిదను వేసింది. దీంతో భారీ వాహనం వెళితే విపరీతంగా బూడిద లేచిపోతోంది. వెనుక వచ్చే వాహనాలకు దారి కనిపించడం లేదు. దీనివల్ల పలు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. గత నెలలో సింగవరానికి ఓ యువకుడు స్కూటీపై రామచంద్రపురం జగనన్న కాలనీలో బంధువుల ఇంటికి వెళుతున్నాడు. ఈ రోడ్డుపై గోతులను తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొని గాయాల పాలై, చికిత్స పొందుతూ మృతి చెందాడు.

రాపాక – కోటికేశవరం రోడ్డు

రాపాక – కోటి కేశవరం ఆర్ అండ్ బీ రోడ్డులో కొంత వరకు మరమ్మతులు చేసి మమ అనిపించారు. రాపాక నుంచి మూడు కిలోమీటర్లు తారురోడ్డుపై పడిన గోతులను అలాగే వదిలేశారు. రాపాకకు మూడు కిలోమీటర్ల దూరం నుంచి కోటికేశవరం వరకు రోడ్డుపై పడిన గోతులను పూడ్చారు. రాపాక నుంచి రైతులు తమ వాహనాలపై ఎరువుల బస్తాలను తమ పొలాలకు తరలించడానికి మూడు కిలోమీటర్లు పలు ఇబ్బందులకు గురవుతున్నారు.

కాతేరు– సీతానగరం రహదారి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలితంగా రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు నుంచి సీతానగరం వరకు నాలుగు లైన్ల రోడ్డు రఘుదేవపురం శివారు వరకూ పూర్తయ్యింది. అక్కడి నుంచి సీతానగరం వరకూ జరగాల్సిన పనులకు అసెంబ్లీ ఎన్నికల కోడ్‌తో బ్రేక్ పడింది. ఎన్నికలు పూర్తయ్యాయి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ ఈ రోడ్డు సంగతిని మర్చిపోయారు. గోతుల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నాలుగు లైన్ల రోడ్డులో మునికూడలి, కాటవరం, ముగ్గళ్ల కల్వర్టుల వద్ద రోడ్డును కలపాల్సి ఉన్నా, దాన్ని కూడా అధికారులు పట్టించుకోకపోవడంతో వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గోతులు, బూడిదతో ఇబ్బందులు



సీతానగరం – పురుషోత్తపట్నం ఏటిగట్టు రోడ్డుపై పడిన గోతులు, వేసిన బూడిదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మెగా కంపెనీ సిబ్బంది ఆ గోతుల్లో క్వారీ బూడిద వేసి వదిలేశారు. వాహనాలు వెళుతుంటే బూడిద విపరీతంగా పైకి లేచిపోతోంది. ఆ దారిలో వస్తున్న వాహనచోదకుల కళ్లలో పడుతోంది. దారి కనిపించక పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. సంక్రాంతికి రోడ్ల మరమ్మతులు పూర్తి చేస్తామన్న సీఎం చంద్రబాబు.. ఆ హామీని నెరవేరలేదు.

– గద్దె వీరన్నబాబు, రామచంద్రపురం

మూడు కిలోమీటర్లు వదిలేశారు



రాపాక – కోటికేశవరం రోడ్డులో రాపాక నుంచి మూడు కిలోమీటర్ల పొడవునా రోడ్డుపై పడిన గోతులకు మరమ్మతులు చేయలేదు. అక్కడి నుంచి కోటికేశవరం వరకూ బాగు చేశారు. సంక్రాంతి పండగ నాటికి ఆ రోడ్డు మరమ్మతులు పూర్తవుతాయని భావించాం. కానీ ఆ రోడ్డును అలాగే వదిలేశారు. మూడు కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం.

– గుండుబోగుల శ్రీనివాసరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, సీతానగరం

7 నుంచి 'నా కార్యకర్తలు - నా కుటుంబం'

- సీతారామపురం నుంచి శ్రీకారం
- విడతల వారీగా అన్ని గ్రామాల్లో నిర్వహణ
- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



రాజానగరం: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా 'నా కార్యకర్తలు – నా కుటుంబం' పేరిట ముఖాముఖి కార్యక్రమాన్ని ఈనెల 7 నుంచి ప్రారంభిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. రాజానగరం మండలం సీతారామపురం నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడతామన్నారు. అనంతరం అన్ని గ్రామాల్లోనూ విడతల వారీగా నిర్వహిస్తామన్నారు. పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలు, కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం వల్ల వస్తున్న నిరసన, భవిష్యత్తు కార్యాచరణ గురించి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి చర్చిస్తామన్నారు.

భజే నారాయణ స్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు ప్రారంభం


అధ్యయనోత్సవాలను తిలకిస్తున్న భక్తులు

రంగంపేట: మండల పరిధిలోని వడిశలేరు గ్రామంలో కొలువైన శ్రీదేవీ, భూదేవి సమేత భజే నారాయణస్వామి తిరు కల్యాణ మహోత్సవాల సందర్భంగా శనివారం అధ్యయనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చిలకమర్రి మురళీ కృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండకు చెందిన ముడుంబై రామానుజాచార్యులు, స్థానిక వేద పండితులు రేగడమిల్లి రాందేవ్‌శర్మలు శుక్ల యజుర్వేద పారాయణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మల్లిడి శ్రీనివాస్, ఆలయ కార్యనిర్వాహణాధికారి ముమ్మన రాంబాబురెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

175 మందికి వైద్యసేవలు


వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: రఘుదేవపురం సచివాలయం–2లో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు 175 మందికి వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చలికాలంలో వచ్చే దగ్గు, రొంప, సీజనల్ జ్వరాలపై అవగాహన కల్పించారు. ఇళ్ల వద్ద నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్పందన, ఏఎన్ఎం రమణ, ఆశావర్కర్లు సావిత్రి, లలిత, షర్మిల, రవళి పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుతో విప్లవాత్మక మార్పులు


సదస్సులో మాట్లాడుతున్న చైతన్య రాజు

రాజానగరం: 'ఇంజినీరింగ్ అండ్ వైద్యశాస్త్రాలలో కృత్రిమ మేధస్సు ఆధారిత ఆవిష్కరణలు' అనే అంశంపై గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో శనివారం అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జీఎఫ్ఐ బోర్డు సభ్యురాలు డాక్టర్ లీలా రాజు మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో కృత్రిమ మేధస్సు విప్లవాత్మక మార్పులను తీసుకురానుందన్నారు. స్మార్ట్ ఫోన్ అప్లికేషన్ల ద్వారా ఆప్తమాలజీలో ఫొటోలు తీసి, పెద్ద సంఖ్యలో రోగులకు నేత్ర పరీక్షలు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందన్నారు. న్యూయార్క్ వెల్ కార్నెల్ వైద్య కళాశాల ఆప్తమాలజీ క్లినికల్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఛాన్స్ ఏ కోల్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు సహాయంతో గ్లకోమా వంటి కంటి వ్యాధులను త్వరితంగా నిర్ధారించవచ్చని తెలిపారు. జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ విల్మర్ఐ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ డాక్టర్ థామస్ జాన్సన్ మాట్లాడుతూ కంటి వైద్యంలో స్టెమ్‌సెల్ టెక్నాలజీ కీలక పాత్ర వహిస్తుందన్నారు. కంటి శస్త్ర చికిత్సలలో ఆధునిక కృత్రిమ మేధస్సు పరిజ్ఞాన ఎలా ప్రభావం చూపుతుందో వివరించారు. ఆస్ట్రేలియాలోని ప్రకృతి విపత్తుల నివారణ శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణ నడింపల్లి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వలన కలిగే నష్టాలను అంచనా వేసేందుకు అత్యాధునిక డేటా అనలిటిక్స్, కృత్రిమ మేధస్సు మోడళ్లను ఏవిధంగా ఉపయోగించాలో అవగాహన కలిగించారు. జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ టీవీ ప్రసాద్, డాక్టర్ ఆర్ఎస్ రాజు, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, ప్రిన్సిపాళ్ల డాక్టర్ టి.జయానందకుమార్, డాక్టర్ కె.వల్లీమాధవి, డాక్టర్ పీజీ రామానుజం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిపై కేసు

రంగంపేట: రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేసినట్టు ఇన్‌చార్జి ఎస్ఐ బి. దుర్గాప్రసాద్ తెలిపారు. మండలంలోని కోటపాడు శివారు అంబేడ్కర్ కాలనీకి చెందిన అర్జంగి ఆనందరావు (45) శుక్రవారం సాయంత్రం టిప్పర్ ఢీకొట్టిన ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. అయితే ఈ ప్రమాదంపై శుక్రవారం ఎటువంటి కేసు నమోదు కాలేదు. శనివారం మృతుడు ఆనందరావు భార్య అర్జంగి రత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌చార్జి ఎస్ఐ దుర్గాప్రసాద్ చెప్పారు..

దళితుడిని వేధిస్తున్నారంటూ ఆందోళన


ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దళిత ప్రజా సంఘాల ప్రతినిధులు

రాజానగరం: మండలంలోని తోకాడలో మేకల లక్ష్మీపతిరావు అనే దళితుడి ఇంటి ముందు కొందరు బల్లలను అడ్డంగా వేసి, వేధింపులకు గురి చేస్తున్నారంటూ స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ముందు దళిత ప్రజా సంఘాలు శనివారం ఆందోళనకు దిగాయి. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీకాంత్, సీఐ వీరయ్య గౌడ్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎంపీడీఓ ఝాన్సీ, తహసీల్దార్ జీఎల్ఎస్ దేవి సమక్షంలో చర్చలు జరిపారు. వారి డిమాండ్ మేరకు ఇంటి ముంగిట వేసిన బల్లలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటామనడంతో ఆందోళనను విరమించారు. ఆందోళనకు నాయకత్వం వహించిన దళిత సంఘాల ప్రతినిధులలో ఇసుకపట్ల రాంబాబు (బీఎస్పీ), నక్కా వెంకటరత్నం (రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా), జనిపెల్ల సత్తిబాబు (అఖిల భారత రైతు కూలీ సంఘం), ముప్పిడి శ్రీనివాస్ (మాలల ఐక్యవేదిక), కొంకి రమేష్ (మానవ హక్కులు), తదితరులు ఉన్నారు.

ఆర్థిక శాస్త్రం అభ్యసిస్తే ఎన్నో ప్రయోజనాలు



సెమినార్‌లో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణ నడింపల్లి

రాజానగరం: ఆర్థిక శాస్త్రాన్ని అభ్యసిస్తే ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబడవచ్చని ఆస్ట్రేలియాలోని ప్రకృతి విపత్తుల నివారణ శాస్త్రవేత్తగా పేరొందిన డాక్టర్ కృష్ణ నడింపల్లి అన్నారు. స్థానిక గైట్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వల్లీమాధవి అధ్యక్షతన 'వృత్తిపరమైన విజయం కోసం వ్యక్తిగత బ్రాండ్‌ను రూపొందించడం' అనే అంశంపై శనివారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. ప్రతి ఒక్కరి చేతిలో ఉన్న సెల్‌ఫోన్ ద్వారా ప్రపంచమే వారి గుప్పిట్లో ఉందన్నారు. దీనిని సక్రమంగా వినియోగిస్తే సమాజహితులుగా ఎదగవచ్చన్నారు. ఔషధ పరిశ్రమ రంగంలో భారత దేశం అగ్రగామిగా ఉందన్నారు. వ్యవస్థాపక నైపుణ్యాలు ఉన్నవారు సొంతంగా స్టార్టప్ కంపెనీలను ప్రారంభించాలని సూచించారు. కృత్రిమ మేధస్సును మరింత ఉత్తమంగా ఉపయోగించుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు. కార్యక్రమంలో జీజీయూ డైరెక్టర్ డాక్టర్ ఆర్ఎస్ రాజు, జీజీయూ క్యాంపస్‌లోని ఇతర కళాశాలల అధ్యాపకులు, హెచ్ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


కూనవరంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: మండలంలోని పలు బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా శనివారం పరామర్శించారు. కూనవరంలో మునసమళ్ల మంగాయమ్మ, నండూరి శేషమ్మ, దారా శేరమ్మ ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. అలాగే కుమారుడిని కోల్పోయిన బడుగు బుజ్జి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. రఘుదేవపురంలో తల్లిని కోల్పోయిన జాషువా, ఆయన కుటుంబీకులతో మాట్లాడారు. పురుషోత్తపట్నంలో తల్లిని కోల్పోయిన వెంపాటి సూరిబాబుకు ధైర్యం చెప్పారు. మాజీ ఎమ్మెల్యే రాజా వెంట ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, సర్పంచ్ చంద్రలీల, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, పార్టీ నాయకులు పెందుర్తి దేవదాసు, కోండ్రపు ముత్యాలు తదితరులు ఉన్నారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

బిక్కవోలు: తన భర్త వేధిస్తున్నాడని బలభద్రపురం గ్రామానికి చెందిన సోమిశెట్టి కృష్ణవేణి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. మండలంలోని బలభద్రపురం గ్రామానికి చెందిన హరి రామకృష్ణ, కృష్ణవేణి దంపతులకు ఆరేళ్ల క్రితం వివాహమైంది. కృష్ణవేణి అనపర్తిలోని స్వీట్స్ దుకాణంలో పని చేస్తోంది. భర్త లారీ డ్రైవర్. అతనికి భార్య ప్రవర్తనపై అనుమానం ఉంది. ఈ కారణంతో తరుచూ ఆమెను వేధింపులకు గురి చేసేవాడు. గత నెల 30న ఆమె తన భర్తకు ఫోన్ చేసి తాను షాపు నుంచి ఇంటికి వస్తున్నానని బలభద్రపురం వంతెన సెంటర్‌కు రమ్మని చెప్పింది. అప్పటికే తప్పతాగి ఉన్న భర్త వచ్చి ఆమెను బైకుపై ఎక్కించుకున్నాడు. ఇంటికి వెళ్లే మార్గంలో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బైకు ఆపి ఆమె తలను స్తంభానికి ఢీ కొట్టించి పక్కనే ఉన్న కాలువలోకి తోసేశాడు. ఆమె తల్లి, సోదరుడు అక్కడికి చేరుకొని అనపర్తి సీహెచ్‌సీకి వైద్యం కోసం తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బంగారు గొలుసు, నగదు మాయం

రాజానగరం: జి.యర్రంపాలెంలోని ఎరువుల దుకాణంలో బంగారు గొలుసు, నగదును దొంగలు మాయం చేశారు. సీఐ వీరయ్య గౌడ్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బైరిశెట్టి సతీష్ తన ఎరువుల దుకాణాన్ని శుక్రవారం రాత్రి మూసి వేసి ఇంటికి వెళ్లిపోయాడు. అయితే తన రెండు కాసుల బంగారు గొలుసు, రూ.75 వేలను దానిలో ఉంచిన సంగతి మరిచాడు. ఎప్పటిలాగే శనివారం ఉదయం ఎరువుల దుకాణం తెరిచేందుకు రాగా, షాపు తలుపులు బద్దలు కొట్టి ఉండటాన్ని గమనించాడు. కంగారుగా లోపలకు వెళ్లి చూస్తే బంగారు గొలుసు, నగదు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై నాగార్జున కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

లలితేశ్వరి హత్య కేసులో నిందితులను శిక్షించాలి

మృతురాలి కుమార్తెతో మహిళల ర్యాలీ



నిందితులను శిక్షించాలని పందలపాకలో ర్యాలీ చేస్తున్న మహిళలు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో కురుపూడి లలితేశ్వరి గత నెల 29న హత్యకు గురైన విషయం విదితమే. ఆమె పుట్టింటి గ్రామమైన పందలపాకలో గత నాలుగు నెలలుగా నివాసం ఉంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్‌గా సేవలందించింది. పందలపాక గ్రామానికి చెందిన ఓ కుటుంబమే లలితేశ్వరిని హత్య చేశారని గ్రామస్తులు, బంధువులు ఆరోపిస్తున్నారు. ఇందులో ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన వారిని వదిలేశారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల తీరును నిరసిస్తూ భారీ ఎత్తున్న మహిళలు లలితేశ్వరిని హత్య చేసిన మిగిలిన నిందితులను అరెస్టు చేయాలని డిమాండు చేస్తూ మృతురాలి కుమార్తెతో ర్యాలీ చేశారు. సుమారు 500 మంది మహిళలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం బిక్కవోలు పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేసేందుకు యత్నించిన మహిళలను అనపర్తి సీఐ సుమంత్ సంముదాయించారు. లలితేశ్వరి హత్య కేసులో నిందుతులందరినీ పట్టుకుంటామని వారికి నచ్చజెప్పారు. దీంతో వారు ఆందోళనను విరమించుకున్నారు.

హత్యకేసులో చురుకుగా విచారణ

నిందితులను అరెస్టు చేస్తామని అనపర్తి సీఐ సుమంత్ అన్నారు. శనివారం ఆయన బిక్కవోలు పోలీసు స్టేషన్ వద్ద మీడియా సమావేశంలో మాట్లాడారు. గత నెల 29వ తేదీన పందలపాక గ్రామంలోని కురుపూడి లతేశ్వరి హత్యకు గురైనట్లు చెప్పారు. నిందితులలో ఒకరైన గుత్తికోలు దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించడం జరిగిందన్నారు. ఇంకా ఈ హత్య కేసులో ఎవరైనా నిందితులు ఉన్నారా.. అనే కోణంలో విచారణ చేస్తున్నామని వెల్లడించారు. ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంపర వేంకటేశ్వరుని ఆలయంలో ఏడు శనివారాల వ్రతం ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో మాఘ మాసం సందర్భంగా స్వామికి ఏడు శని వారాల వ్రతం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ ప్రధాన అర్చకుడు ఇండవిల్లి హనుమంతాచార్యులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. దూర ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాలకు హాజరవుతారని ఆయన తెలిపారు. స్వామి వారికి తలసిపూజ, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. భక్తులతో వ్రతాన్ని ఆచరింపజేశారు.

నంబర్ ప్లేట్లు లేకుంటే వాహనాల సీజ్


రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న సీఐ సత్య కిషోర్

సీతానగరం: నంబర్ ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేస్తామని కోరుకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యకిషోర్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ నిర్వహిస్తున్న రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లు, వాహన చోదకులకు తవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహన ప్రమాదాల కారణంగా పలు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. మద్యం తాగి వాహనాన్ని నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ తదితర కారణాలు దీని వెనుక ఉన్నాయని తెలిపారు. వాహన చోదకులు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపరాదన్నారు. ఎస్సై డి.రామ్ కుమార్ మాట్లాడుతూ వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని, కారులో సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదన్నారు.